ఎదురుగా వారికి అతి చక్కటి దేవాలయం బొమ్మ కనిపించింది. గుడి బయట చక్కటి లాన్స్, ఫౌంటెన్స్, బంగారు గోపురం. ఆ ఆలయం ఎంతో సుందరంగా వుంది.

రాజుగారు వెంటనే ఆ చిత్రకారుడిని అడిగారు.

"నే చెప్పింది నువ్వు సరిగ్గా వినలేదా? నేను శిథిలమైన దేవాలయం బొమ్మని కదా గీయమన్నది? మరి ఇంత అందమైన బొమ్మని గీసావేమిటి?"

"నేను పొరబాటుగ్గా వినలేదు. మీరు కోరినట్లే నేను శిథిలమైన దేవాలయాన్నే గీసాను రాజా." చెప్పాడు చిత్రకారుడు.

"మాకలా అనిపించడం లేదు." చెప్పారు రాజుగారు.

"ఓ సారి ఆలయం కిటికీ లోంచి వెండి శఠగోపం వున్న ప్లేట్‌ని చూడండి. దాన్నిండా సాలెగూళ్ళు. నేల మీద దుమ్ము. పైనంతా బూజు. భక్తులు సరిగ్గా రాని దేవాలయమే నా ఉద్దేశంలో శిథిలమైన దేవాలయం తప్ప భౌతికంగా శిథిలమైనది శిథిలాలయం కాదు." వివరించాడు ఆ చిత్రకారుడు.

## 64. ఏకాగ్రత

ఒకతను ఓ సన్న్యాసి దగ్గరకి వెళ్ళి అడిగాడు.

"స్వామీ! మీ మనసు ఎప్పుడూ పరిపూర్ణంగా దైవం మీద నిలచి వుంటుందని విన్నాను. నిజమేనా?"

అవునన్నట్లుగా తలూపాడు అతను.

"ఎంత ప్రయత్నించినా నాకా ఏకాగ్రత సాధ్యం కావడం లేదు. అందుకు నాకో దారి చెప్తారన్న ఆశతో వచ్చాను."

"సరే. ఈ రాత్రికి ఆశ్రమంలో నిద్ర చెయ్యి. రేపు మళ్ళీ కలుద్దాం." చెప్పాడా సన్న్యాసి.

ఓ మంచం మాత్రమే పట్టే అతి చిన్న కుటీరంలో పడుకున్నాడతను. పై కప్పు మీద నించి సన్నటి దారానికి వేలాడే ఓ కత్తి అతని కంట పడింది. ఆ దారం తెగితే అది సూటిగా వచ్చి అతని గుండెల్లో గుచ్చుకుంటుంది. మృత్యు

భయం ఏర్పడి అతనిలో ఆందోళన మొదలైంది. బయట తలుపు గడియ పెట్టి వుండటంతో బయటకి వెళ్ళలేక పోయాడు. ఆ రాత్రంతా అతను మేలుకుని ఆ కత్తి వంకే చూస్తూ భయంగా గడిపాడు.

మర్నాడు వుదయం అతని కుటీరం తలుపు తెరచుకుని వచ్చిన సన్న్యాసి అడిగాడు.

"రాత్రి బాగా నిద్ర పట్టిందా?"

"ఊహు. ఆ కత్తి వంక చూస్తూంటే ఎక్కడ నిద్ర పడుతుంది?"

"రాత్రంతా నువ్వు మృత్యు స్మరణలో వున్నట్లుగా నేను దైవం మీద మనసుని కేంద్రీకరించి ఆయన గురించి ఆలోచిస్తున్నాను. నీకు నీ ప్రాణం ఎంత ముఖ్యమో నాకు దైవం అంత ముఖ్యం అనుకోబట్టే ఇది సాధ్యం అయింది." వివరించాడా సన్న్యాసి.

## 65. త్యాగి

వర్షాకాలంలో వేగంగా ప్రవహించే అలకానంద నదిలో ఓ పడవలో ప్రయాణించేవారిలో, చైనా నించి ఇండియాకి వచ్చిన యాత్రికుడు హ్యూయన్‌సాంగ్ కూడా ఉన్నాడు. అతను తన వెంట నలందా విశ్వవిద్యాలయం నించి సేకరించిన అపూర్వ గ్రంథాలెన్నిటినో టిబెట్‌కి తీసుకెళ్తున్నాడు. నది ఉధృతికి పడవని కంట్రోల్ చేయడం పడవ నడిపే సరంగు వల్ల కావడం లేదు. పడవ మునిగిపోవచ్చున్న భయంతో సరంగు ప్రయాణీకులకి చెప్పాడు.

"పడవలో ఎక్కువ మంది మనుషులు ఎక్కడంతో బరువు ఉండాల్సిన దానికన్నా ఎక్కువగా ఉంది. పడవ తేలిక అయితే తేలిగ్గా అవతలి గట్టుకి చేరగలం. కాబట్టి అంతా కొంత సామానుని నదిలోకి పారేసి పడవ బరువుని తగ్గించండి."

అంతా హ్యూయాన్‌సాంగ్ వైపు తిరిగి చెప్పారు.

"నీ దగ్గర ఉన్న మూటలోని పుస్తకాలు మనిషి బరువు కన్నా ఎక్కువ. కాబట్టి నువ్వా మూటని బయటకి గిరాట్టేస్తే చాలు."